సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,27 నవంబర్ 2024


# ఆత్మీయ పలకరింపులకు కార్తీక అన్న సమారాధన వేదిక



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** బంధాలు, అనుబంధాలు పెంపొందించుకొని ఆత్మీయ పలకరింపులకు కార్తీక అన్న సమారాధన వేదికగా నిలుస్తుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కొవ్వూరు నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కొవ్వూరు మండలం నందమూరి గ్రామంలోని పెరవల్లి రంగా ప్రసాద్ ఫామ్ హౌస్ నందు కార్తిక వన సమారాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్తీక మాసంలో వనాల నందు దేవతలు నివాసం ఉంటారని అటువంటి వనాలకు పూజలను నిర్వహించుకుని భోజనాలు స్వీకరిస్తే ఆబంధాలు అనుబంధాలుగా మారుతాయని ప్రజల విశ్వాసం అన్నారు. మారుతున్న కాలంతో ఆత్మీయ పలకరింపులు దూరమవుతున్నాయని ఆత్మీయ అనుబంధాలకు కార్తీక అన్న సమారాధన గొప్ప వేదిక గా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, కొవ్వూరు మండల పరిషత్ అధ్యక్షులు కాకర్ల నారాయుడు, కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, నాయకులు సూర్యదేవర రంజిత్ కుమార్ కొవ్వూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దాయన రామకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు,రాజమండ్రి నాయి బ్రాహ్మణ సంఘంసభ్యులు సిట్టా బత్తుల నాగబాబు, అందనాపల్లి సత్యనారాయణ, కొవ్వూరు పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్

# తోట తనిఖీలతో హడల్








- నడకుదురు షాటెక్స్ గోడౌన్‌లో పిడిఎస్ బియ్యం
- ఐదు లారీల్లో తెలంగాణ నుండి రా రైస్
- నాలుగు గంటలు డిఎస్ఓ ప్రసాద్ కోసం వేచిచూడాల్సివచ్చిన చైర్మన్ తోట
- కలెక్టర్ షాన్‌మోహన్ మందలింపుతో కదలిన యంత్రాంగం
- రైస్ మాఫియా గుప్పిట్లో డిఎస్ఓ
- బుధవారం అధికారుల బృందం నిశిత పరిశీలనతో నిగ్గుతేలనున్న అక్రమం

పౌరసరఫరాల సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ కాకినాడ రూరల్ మండలంలోని నడకుదురు గ్రామంలో లవన్ ఇంటర్నేషనల్ షాటెక్స్ మిల్లు, గోడౌన్లో ఆకస్మిక తనిఖీలతో హడలెత్తిం చేశారు. పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్‌కి రాబడిన సమాచారంతో జనసైనికులతో కలసి మంగళవారం సాయంత్రం షాటెక్స్ మిల్లు, గోడౌన్లో తనిఖీలు చేసి భారీ ఎత్తున పిడిఎస్ చౌక బియ్యం నిల్వలను, ఐదు లారీల్లో రా రైస్ బియ్యాన్ని కనుగొన్నారు. ఈ తనిఖీలు కాకినాడ జిల్లాలో రైస్ మాఫియాలో అతిపెద్ద కుదుపుతో సంచలనం రేపింది. ఇదే షాటెక్స్ మిల్లుపై గతంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలుచేసిపెద్దయెత్తున పిడిఎస్ చౌకబియ్యాన్ని వేలాది మెట్రిక్ టన్నులుగా గుర్తించి, 4459 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యాన్ని ఇక్కడే మంత్రి మనోహర్ సీజ్ చేశారు. ఇంత పెద్దయెత్తున పేదలకు అందాల్సిన ప్రభుత్వ చౌకబియ్యంతో ఈ యాజమాన్యం దొంగ వ్యాపారం చేస్తుంటే... జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్ నెలనెల మామూళ్ళు తీసుకుని రైస్ మాఫియాతో అంటకాగుతున్నట్లుగా తెలుస్తోంది. పట్టుబడిన బియ్యాన్ని మొత్తం విడుదల చేసిన ఘనత సదరు డిఎస్ఓకే చెందింది. ఇప్పుడు తాజాగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్ తనిఖీల్లో దొంగల బండారం మొత్తం బయటపడిందని జనసైనికులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.పౌర సరఫరాల సంస్థ టెక్నికల్ అధికారులు వచ్చి పరిశీలన చేశారు. చాలా బ్యాగుల్లో పోర్టిఫైడ్ బియ్యాన్ని కనుగొన్నారు. బియ్యం నిల్వలను పరిశీలన నిమిత్తం పోలీసులతో నిఘ చేయించారు. కలెక్టర్ షాన్ మోహన్ నేతృత్వంలో రెవెన్యూ, పౌరసరఫరాలు, తూనికలు కొలతల శాఖ తదితర అధికారులు బుధవారం నిల్వలను నిశిత పరిశీలన చేయనున్నారు. ఏ మేరకు రెండోసారి ఈ యాజమాన్యం అక్రమాలకు పాల్పడ్డారో అన్న నిగ్గు తేల్చనున్నారు

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

- మిగతా 2 లో..

## బిజెపి కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**అమలాపురం,మేజర్‌న్యూస్:** రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బిజెపి జిల్లా కార్యాలయంలో కాన్స్టిట్యూషన్ డేను అత్యంత మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు యాళ్లదొరబాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని లిఖించటానికి అహర్నిశలు కృషిచేసి అత్యద్భుతమైన రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ముసాయిదా కమిటీ సభ్యుల కృషినిగౌరవపూర్వకంగా సభ్యులందరినీ చిత్రపటాన్ని పూలమాలతోఅలంకరించి అభినందించారు. మహనీయులు అందించిన రాజ్యాంగాన్ని గౌరవిస్తూ అనుసరిస్తూ బలమైన భారతదేశాన్ని నిర్మించుకోవడానికి ప్రతిఒక్కరు పాటుపడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి అమలాపురం పార్లమెంట్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, అడపాల సత్యనారాయణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, గని శెట్టి వెంకటేశ్వరరావు, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్ గౌడ్, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు జగతా శాంతి, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు రవీంద్ర, బిజెపి సీనియర్ నాయకులు దాట్ల వెంకట సుబ్బరాజు, వాణిజ్య విభాగం జిల్లా కన్వీనర్ కంకటాల నాని, జిల్లా కార్యవర్గ సభ్యులు మద్యం శెట్టి శ్రీనివాస్, అరిగిల తేజ వెంకటేష్, బండి శ్రీనివాస్, సుంకర సాయి, దేగల వెంకటరమణ, మోకా ఆదిలక్ష్మి, రామచంద్రపురం టౌన్ అధ్యక్షులు పీకే రాఘవేంద్రరావు, అవసరాల వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 108 అత్యవసర సేవలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

**- కలెక్టర్ మహేష్ కుమార్**




**అమలాపురం, మేజర్ న్యూస్ :** వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో రవాణా మరియు వైద్యసంరక్షణనుఅందించే 108 ఉచిత అత్యవసర సేవలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్లో వైద్యాధికారులు108సమన్వయ అధికారులతో సమావేశం నిర్వహించి 108 అత్యవసర వైద్య సేవలకు సంబంధించి అరవిందో సంస్థ వాహన డ్రైవర్లు ఆ సంస్థతో ధర్నాకు దిగిన మూలంగా అత్యవసర వైద్య సేవలు నిలిచిపోకుండా తాత్కాలిక ప్రాతిపదికన ప్రత్యామ్నాయంగా నాలుగు చక్రాలలైట్ మోటార్ వాహన లైసెన్స్ కలిగినవారిని జిల్లా రవాణాఅధికారిసమన్వయంతో నియమిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. 12 గంటలకు ఒక షిఫ్ట్ మరో 12 గంటలు ఇంకో షిఫ్టులో వాహనచోధకులను నియమించాలని ఆదేశించారు. వీరికి కనీస వేతనం షిఫ్ట్‌ల వారీగా అందించడం జరుగుతుందన్నారు. జాతీయ గ్రామీణ హెల్త్ మిషన్ నిధులతో ఈసేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈవాహనాలలో పనిచేసే మిడ్ లెవెల్ హెల్త్ వర్కర్లు 432 మందికి అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ వైద్య సేవలపై టెక్నీషియన్ల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని డిఎంహెచ్ఓ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ఐదు అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ 108 అత్యవసర వైద్య సేవల వాహనాలు ఉండగా మిగిలినవి 39 బేసిక్ సపోర్ట్ వాహనాలని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో 108అత్యవసర వైద్యసేవల జిల్లా కోఆర్డినేటర్ అజయ్, జిల్లా వైద్యశాల సమన్వయ అధికారి కార్తీక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా రవాణాశాఖ అధికారి డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జెండర్ హింసకు వ్యతిరేకంగా పోరాడుదాం

**- రౌతులపూడి ఏపీఎం నాగమణి**



**రౌతులపూడి, మేజర్ న్యూస్ :** జెండార్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు ఐక్యతతో ఒకే స్వరముతో ముందుకు సాగాలని రౌతులపూడి ఏపిఎం నాగమణి అన్నారు. ఆడ మగ లింగ బేధం తేడా లేకుండా ప్రతి ఒక్కరూ సమానత్వంతో దేశ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఆడ మగ వాళ్ళ వాళ్ల ప్రతిభను చాటి చెప్పేలా ప్రోత్సహించాలన్నారు. ఆడ మగవారికి కష్టాన్ని తగినట్టుగా సమానత్వంతో వేతనాలు చెల్లించాలన్నారు. జెండర్ హింసకు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమం అన్నారు. నవంబర్ 25 నుండి డిసెంబర్ 23 వరకు గ్రామస్థాయిలో ప్రసార ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి వ్యక్తికి అవగాహన కలిగేలా జాతీయస్థాయి నుండి గ్రామస్థాయి వరకు హింసకు వ్యతిరేకంగా పోరాడాలని ఆమె సూచించారు. ప్రతి ఒక్కరూ సమానత్వంతో విద్యావంతులుగా ఎదగాలన్నారు. గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించాలని విఓఏ లకు సిబ్బందికి సూచించారు. అనంతరం మహిళా సమైక్య సిబ్బందితో మండల సమైక్య నుండి ఆర్ఎంబి రోడ్డు వరకు జెండల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిసిలు అప్పలకొండ,సీత,రత్న రాజు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్చకులకు ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు చేతులు మీదుగా సత్కారం



**అనపర్తి,మేజర్‌న్యూస్ :** అనపర్తి గ్రామంలో పాత ఊరులో కొలువై ఉన్న శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక సోమ వారం పర్వదినం పురస్కరించుకుని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించేసుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ పోతం శెట్టి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అనపర్తి గ్రామ ప్రముఖ పురోహితులు నాగదేవర పద్మనాభ శాస్త్రి దంపతులకు, ఉమారావ ులింగేశ్వర స్వామి ప్రధాన అర్చకులు బాదంపూడి కాళి రామలింగేశ్వర శర్మ దంపతులకు మరియు ప్రముఖ డోలు విద్వాన్ చింతలపూడి శేషగిరి దంపతులను ఎమ్మెల్యే దంపతులకు చేతుల మీదుగా సన్మాన, సత్కార కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ హిందూ ధర్మానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, పురోహితులు, అర్చకులు తదితరులు హిందూ ధర్మాన్ని కాపాడడంలో, హిందూ ధర్మాన్ని పరిరక్షించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ శివాలయాన్ని ఆలయ చైర్మన్ ఆధ్వర్యంలో చాలా అపురూపంగా తీర్చిదిద్దడం జరిగిందని, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రంతులకు వేద ఆశీర్వచన కార్యక్రమం నిర్వహించి జ్ఞాపకను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కామేశ్వర శర్మ బృందం,ఆలయ ఈవో శ్రీనివాసరావు, చాట్రాతి వీర వెంకట సత్యనారాయణ చౌదరి, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, టీచర్ నాగమణి, తెలుగుదేశం వాణిజ్య విభాగం అధ్యక్షుడు తమలంపూడి సుధాకర్ రెడ్డి, దత్తుడుశ్రీను, మాజీ ఎంపీపీ శేషారత్నం,తెలుగుదేశం గ్రామ శాఖ అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి (సప్లై కంపినీ), ఆదినారాయణ రెడ్డి బ్రదర్స్, ప్రకాష్, సత్తిరెడ్డి, వైజాగ్ శ్రీను, అనపర్తి టౌన్ ఎన్‌డిఏ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలోభక్తులు పాల్గొన్నారు.

## రీ సర్వే గ్రామ సభలు అంశాలపై సమీక్ష



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ కె.శ్రీరమణి డివిజన్‌లో తహశీల్దార్లతో పిజిఆర్ఎస్, ఫ్రీ హోల్డ్ రిపోర్టులు, ఎంఎల్‌సి ఎన్నికలు, రీ సర్వే గ్రామ సభలు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌రీసర్వే గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను సమగ్రంగా విచారణ జరిపి అర్జీదారులకు న్యాయం చేయాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్డీఓకార్యాలయ ఏఓ మాధవరావు, పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ, డివిజన్‌లోని తహశీల్దార్లు, డిటి భానుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది

**- భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి**
**- ప్రతి ఇంట్లో రాజ్యాంగ పీఠిక ఉండాలి**
**- నేటి యువతకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తి కావాలి**
**- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్**



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :** భారతరాజ్యాంగం ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వంటిదని, రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, ప్రతి ఇంట్లో రాజ్యాంగాన్ని ఉంచుకుని మన చట్టాలు, హక్కులు పట్ల అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామచంద్రపురంలోని బ్యాంక్ సెంటర్లో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి మంత్రి సుభాష్ పూలమాలలు వేసి, నివాళులు, జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ 75వ భారత రాజ్యాంగ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా ఉండి మనదేశానికి రాజ్యాంగాన్ని అందించారన్నారు. రాజ్యాంగం అంటే కేవలం రాత ప్రతి కాదని, ఒక జాతి జీవన విధానమని దేశమంతటికి నిరంతర చైతన్య స్ఫూర్తి అని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన సందర్భాన్ని గుర్తు చేశారు. నీకోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు, జనం కోసం జీవిస్తే.. జనం హృదయాల్లో నిలిచిపోతావు అని నినదించిన డాక్టర్‌బి.ఆర్‌అంబేద్కర్ యావత్‌ప్రపంచానికి ఆదర్శనీయుడని కొనియాడారు. ప్రపంచ దేశాలన్నీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విజ్ఞానాన్ని, మేధస్సును గుర్తించాయన్నారు. అంటరానితనం నిర్మూలన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహానీయుడిగా అభివర్ణించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగారాజ్యాంగ సృష్టికర్తను స్మరించుకోవడం ఆనందకరమన్నారు. ఆశయాలు ఆచరణలో పెడితే.. మనిషి మహానీయుడు అవుతాడు అనే డాక్టర్ అంబేద్కర్ మాటలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి కావాలని కోరారు. భారతదేశ అతిపెద్ద రాజ్యాంగాన్ని డాక్టర్ అంబేద్కర్ 2 సంవత్సరాల,11 నెలల, 18రోజులు శ్రమించి రాశారని, దేశం, ప్రజలపట్ల ఆయనకున్న బాధ్యత గొప్పది అన్నారు. ప్రపంచ దేశాల్లోనే అతిపెద్ద రెండో రాజ్యాంగంగా మనదేశానికి గుర్తింపు వచ్చిందన్నారు. ఐక్యరాజ్యసమితి సైతం అంబేద్కర్ ను అపర మేధావిగా గుర్తించి ఆయన పుట్టినరోజు ఏప్రిల్ 14న "నాలెడ్జ్ డే"గా ప్రకటించి, జరుపు కోవటం భారతదేశానికి గర్వకారణం అన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా శ్రమించి,తనజీవితం వెనుకబడిన వర్గాల ఉన్నతి కోసం ధారబోసారన్నారు. బోధించు,సమీకరించు, పోరాడు అనే నినాదంతో సమాజంలో వెనుకబడిన వర్గాలకు భరోసా ఇచ్చారన్నారు. రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికి సామాజిక, ఆర్థిక, ప్రజాస్వామిక ప్రాథమిక హక్కులు కల్పించారని మంత్రి సుభాష్ అన్నారు. డాక్టర్ అంబేద్కర్ జ్ఞానం అద్భుతం, అనితరసాధ్యమని,రాజ్యాంగ నిర్మాణంలో భిన్నత్వంలో ఏకత్వం అనే నినాదం ఇచ్చారని ప్రశంసించారు. ప్రజలస్వేచ్ఛ, స్వాతంత్రాలను కాపాడటంలో రాజ్యాంగ పీఠిక ప్రధాన భూమిక పోషిస్తుందని, సమ సమాజ స్థాపనకు కృషి చేసిన డాక్టర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడుగా అభివర్ణించారు. స్వేచ్ఛ సమానత్వం, జీవించే హక్కు కోసం నిరంతర కృషి చేశారని మంత్రి సుభాష్ అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరివాడని ఆయన స్ఫూర్తితో యువత ముందుకు నడవాలని మంత్రి సుభాష్ కోరారు. బాల్యం నుంచే ఎన్నోఅవమానాలు,అడ్డంకులు ఎదుర్కొని విద్య అనేఆయుధంతో కోట్లాది ప్రజలజీవితంలో అంధకారాన్ని తొలగించారన్నారు. చట్టసభల్లోరిజర్వేషన్లు,ఓటుహక్కు, కార్మిక చట్టాలు, కార్మికుల హక్కులు ప్రజల కోసం పొందుపరిచారన్నారు. అట్టడుగు స్థాయి నుంచి అందరివాడుగా ఎదిగారని, ప్రజాస్వామ్య వ్యవస్థకు రాజ్యాంగం ద్వారా పునాది వేశారన్నారు. భారతదేశ తొలి న్యాయశాఖ మంత్రిగా పనిచేశారని, చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసిన మహా మేధావిగా ఆయన చరిత్ర లో నిలిచిపోతారన్నారు. ఆయన మన మధ్య లేకున్నా.. భారత రాజ్యాంగం రూపంలో మన మధ్య ఉన్నారని గుర్తు చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు, సమానత్వం కోసం, సమ సమాజ స్థాపన కోసం మనమంతా కృషి చేద్దాం..ఆయన అడుగుజాడల్లో నడుద్దాం..నవ సమాజాన్ని నిర్మిద్దాం అంటూ మంత్రి సుభాష్ నినదించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ కౌన్సిల్ తొలి సమావేశం విజయవంతం

**- డాక్టర్ బిఈవివిఎల్ నాయుడు**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఆదిత్యడిగ్రీ మరియు పీజీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) తొలి అకడమిక్ కౌన్సిల్ సమావేశం విజయవంతంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఈవివిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాల బోర్డు హాలులో అకడమిక్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆఫ్లైన్ మరియు ఆన్లైన్ మార్గాలలో జరిగిన ఈసమావేశంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంచార్జ్ ఉపకులపతి ప్రొఫెసర్ వై శ్రీనివాసరావు, యూనివర్సిటీ ఆంగ్ల విభాగాధిపతి ప్రొఫెసర్ డి జ్యోతిర్మయి, ఆదికవి యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి వెంకటేశ్వరరావు క్రిఫి సాఫ్టేర్ డైరెక్టర్ కె కృష్ణారెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఆదిత్య గీతంతో ప్రారంభమైన ఈ సమావేశంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ నాక్‌లో 3.66/4 సిజిపిఏ పాయింట్లతో రాష్ట్రంలోనే అత్యధిక స్కోరును సాధించి ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ తోపాటు అటానమస్ స్టేటస్ సాధించడం జరిగిందని ఇదొక అద్భుత విజయమని అన్నారు. అకడమిక్ కౌన్సిల్ నెంబర్ సెక్రెటరీ డి బ్యుల సమావేశ ఎజెండా, కోర్సుల వివరాలు, సాధించిన విజయాలు , అకడమిక్ క్యాలెండర్, కళాశాలలో నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలు, ప్లేస్మెంట్స్, విద్యాభివృద్ధికోర్సులు, పాఠ్య ప్రణాళిక, పరీక్ష విధానం వంటి విషయాలు వివరించారు. అనంతరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ వై శ్రీనివాసరావు ఆదిత్య విద్యాసంస్థల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. కళాశాలలో పాటిస్తున్న నాణ్యత ప్రమాణాలను,ప్లేస్మెంట్స్‌లో సాధించిన విజయాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. తగు సూచనలను, సలహాలను అందించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఇంచార్జ్ ఉపకులపతి మరియు ప్రొఫెసర్లకు ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాల బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆరోగ్య భారతి మరియు భారత్ వికాసా ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలోని మంగళవారం ఎర్రంపేటలోని ఆరోగ్య భారతి మరియు భారత్ వికాస్ పరిషత్ విజయవాడ వారి ఆధ్వర్యంలో కస్తూరిబా ఆశ్రమ పాఠశాలలోని 80 మంది విద్యార్థినులకు నూతన డ్రస్సులు పంపిణీ చేయడం జరిగింది. ఆరోగ్య భారతి వికాస్ పరిషత్ గత నెలలో కూడా 80 మందికి డ్రస్సులు పంపిణీ చేసినట్లు సేవా భారతి వైద్యులు గంగాధర్ వరప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు సేవాభారతి వైద్యులు డాక్టర్ గంగాధర ప్రసాద్, సేవాప్రముఖ్ ఆవుల సుబ్బారావు, సమరసత సేవా ఫౌండేషన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలతో ముందుకు వెళ్లాలి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలతో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని ఎంపీడీవో బి.కే.ఎస్.ఎస్.వెంకట్ రామన్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అందరికీ ఆమోద యోగ్యంగా రూపొందించి ప్రపంచవ్యాప్తంగా దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమములో పరిపాలనాధికారి వి.రామ స్వరూప్, సీనియర్ సహాయకులు పి.అనిల్ కుమార్, జూనియర్ సహాయకులు ఆర్.ఎస్.ప్రత్యూష, టైపిస్టు పి.వి.ఎస్.ఆర్.సి .హెచ్.పురుషోత్తమరావు,విద్యాశాఖ సిబ్బంది ఈ.రాంబాబు పాల్గొన్నారు.

# రైతులు, కార్మిక సమస్యలపై మహా ధర్నా

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న మహా ధర్నాలో భాగంగా రంపచోడవరంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకత్వంలో ధర్నా, మానవహారం నిర్వహించారు. మొదట అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేశారు. ఆర్టీసీ బస్టాండ్ నుండి సబ్ కలెక్టర్ ఆఫీస్ వరకు ప్రదర్శన చేసి సబ్ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ ధర్నాను ఉద్దేశించి రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ వంజం జోగారావు, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తాటి బుల్లబ్బాయి మాట్లాడుతూ.. రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల మీద, కార్మిక వర్గం, వృత్తి సంఘాల వారి ఎదుర్కొంటున్న సమస్యల మీద అన్ని జిల్లా కేంద్రాల్లో దేశవ్యాప్తంగా ధర్నా జరుగుతుందని, దేశంలో రైతాంగం కష్ట పడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర హక్కు కల్పించమని అడుగుతున్నామన్నారు. రైతులపై పెరుగుతున్న రుణ భారాలు మాఫీ చేయమని కోరుతున్నామన్నారు. ముంపుకి గురవుతున్న ప్రతి గ్రామానికి ప్రతి నిర్వాసిత కుటుంబానికి ముందు భూమికి భూమి, పునరావాసం నష్టపరిహారం చెల్లించిన తర్వాతే ప్రాజెక్టు పనులు సాగించాలని, తమ సమస్యలు పరిష్కారం కోసం, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, కౌలు రైతుల చట్టంలో భూ యజమాని సంతకం ఉండాలన్న నిబంధనను తొలగించాలి, కార్మిక వ్యతిరేక కార్పొరేట్ అనుకూల నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించాలని, విశాఖ ఉక్కు





ప్రైవేటీకరణను విరమించాలి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి, రైతుల పేదల పాలిట ఉరితాడు కాగల ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరించాలి, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి, వారికి పునరావాసం పరిహారం కల్పించాలని, 46.7కాంటూరులో ముంపుకి గురి అయ్యే గ్రామాలన్నిటికి అన్ని రకాల నష్టపరిహారంలు చెల్లించాలని, ఇప్పటికే కాళ్లీ చేసి పునరావాస కాలనీలకు వచ్చిన నిర్వాసితులకు అందవలసిన న్యాయమైన ఆర్ అండ్ ఆర్ నష్టపరిహారం లు, ఇళ్ల నష్టపరిహారం లు,భూమికి భూమి, డి పట్టాలకు నష్టపరిహారం లు,ఇచ్చి మౌలిక వసతుల అయినా మంచినీరు, మరుగుదొడ్లు, శ్మశానాలు, రోడ్లు, డ్రైనేజీలు, కరెంట్, వీధిలైట్లు, విద్యాలయాలు, దేవాలయాలు ఏర్పాటు చేయాలని, అటవీ హక్కుల పరిరక్షణ సవరణ చట్టం 2023ను ఉపసంహరించాలని, ఆదివాసీలు అటవీ నివాసుల హక్కులను పరిరక్షించాలని అటవీ హక్కుల పరిరక్షణ సవరణ చట్టం వెంటనే నిలిపివేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలుగా నిర్ణయించి అమలు చేయాలని, కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ దయల్వేజీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉపాధి పని దినాలను 200 రోజులకు పెంచి రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలని, గృహ వినియోగదారులకు చిన్న వ్యాపారులకు వ్యవసాయ మోటార్లకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించరాదని, మూసివేసిన వ్యవసాయదారిత పరిశ్రమలను వెంటనే తెరిపించి కార్మికుల వలసలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ ఆఫీసులో కాకుండా ఐటిడిఏ వద్ద ఉన్నారని తెలియడంతో, అక్కడ,నుండి ఊరేగింపు గా ఐటిడిఏ వరకు వచ్చి ఇక్కడ ధర్నా చేయడం జరిగింది. ధర్నా ముందుకు ఐటిడిఏ పీవో మరియు సబ్ కలెక్టర్ రావడంతో వారికి సమస్యలతో కూడిన మెమోరాండంను ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు, కార్యకర్తలు ఇ.రాంబాబు, కె,రామిరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

## ఉసులుమర్రు పుష్కర ఘాట్‌లో వైభవంగా వెంకటేశ్వర కళ్యాణం



**పెరవలి,మేజర్‌న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రు గ్రామంలో శ్రీ వశిష్ఠ గోదావరి పుష్కర ఘాట్ నందు నవంబర్ 26వ తేదీ సోమవారం రాత్రి ఉసులుమర్రు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో కార్తీక సోమవారం సందర్భంగావాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నుండి తీసుకువచ్చిన స్వామివారి ఉత్సవ విగ్రహాలతో వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం జరిగింది. వశిష్ట గోదావరి నదితీరంలో గోదావరిలంకలో ఏర్పాటు చేసిన శ్రీ వేంకటేశ్వర కళ్యాణంలో శ్రీవారికి నిడదవోలు నియోజక వర్గ మాజీ శాసనసభ్యులు మరియు తెదేపా ఇంఛార్జి బూరుగుపల్లి శేషారావు సోదరులు బూరుగుపల్లి శ్రీనివాసరావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.ఈ కార్యక్రమం తిలకించడానికి భారీ సంఖ్యలో విచ్చేసిన మహిళా భక్తులకు నిర్వాహకులు చక్కటి ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## గల్ఫ్ దేశాలకు ఉపాధి కొరకు వెళ్లే వ్యక్తులు గుర్తింపు లేని సంస్థలను నమ్మి మోసపోతున్నారు

**– ప్రొటెక్ట్ ఇమిగ్రేషన్ డిపార్ట్మెంట్ అధికారులు ఏ.రవికుమార్, ఆర్.కృష్ణ**




**కొవ్వూరు,మేజర్‌న్యూస్ :** గల్ఫ్ దేశాలకు ఉపాధి కొరకు వెళ్లే వ్యక్తులు గుర్తింపు లేని సంస్థలను నమ్మి మోసపోతున్నారని ప్రొటెక్ట్ ఇమిగ్రేషన్ డిపార్ట్మెంట్ అధికారులు ఏ.రవికుమార్, ఆర్.కృష్ణ తెలిపారు. మంగళవారం కొవ్వూరు పట్టణసీఐ పీ.విశ్వం అధ్యక్షతన పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో తూర్పుగోదావరి జిల్లా పోలీస్ మరియు ప్రొటెక్టర్ ఇమిగ్రేషన్, హైదరాబాద్ మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్టర్నల్ ఎఫైర్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రొటెక్ట్ ఇమిగ్రేషన్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ టూరిస్ట్ వి సాలను ఉండి విదేశాలలో ఉద్యోగం చేసుకోవడం చట్టరీత్య నేరం అని, అలా చేయడంవల్ల వారికి ఏదైనా ఇబ్బంది కలిగితే వాటిని గుర్తించడం చాలా కష్టతరమని అన్నారు. ఎవరైనా విదేశాలకు వెళ్లి మోసపోయినట్లయితే 040-27772557 హెల్ప్ లైన్ నెంబర్ కి కాల్ చేసి తమ వివరాలను తెలియజేస్తే మాడిపార్ట్మెంట్ వారు పరిశీలిస్తారని తెలిపారు.ప్రప్రదముగాఇటువంటికేసులు తూర్పు గోదావరి మరియు పశ్చిమ గోదావరి జిల్లాలో గుర్తించడం జరిగింద న్నారు. ఈ సందర్భంలో కొవ్వూరు పట్టణంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు డిఎస్పి జి.దేవకుమార్, కొవ్వూరు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.విశ్వం, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయబాబు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అల్లవరం, మేజర్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ క్యాంప్ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పుష్పమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరూ ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాలు సాధన కోసం పనిచేయాలన్నారు. ఈరోజు ప్రతి నగరాలలో, పట్టణాలలో, వీధులలో అతని విగ్రహాలు పెట్టి పూజిస్తున్నారంటే దానికి ప్రధాన కారణం విద్య అని, కాబట్టి ప్రతి ఒక్కరు విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని యువత అందరూ అతని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని తెలియజేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మహిళల కోసం, నిమ్న వర్గాల హక్కుల కోసం, వారి అభివృద్ధి కోసం ఎంతో పాటుపడి రాజ్యాంగాన్ని రచించారని, మన రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన ఈ రోజును రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలియజేశారు. ఈ రాజ్యాంగాన్ని రచించడానికి రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టిందని, అంబేద్కర్ మన రాజ్యాంగాన్ని మన దేశ సామాజిక అవసరాలకు భారతదేశ పరిస్థితులకు తగ్గట్టుగా మనకు అనువైన రాజ్యాంగాన్ని రచించడానికి అనేక దేశాల రాజ్యాంగాలను పరిగణలో తీసుకుని అందులో మనకు ముఖ్యంగా ఉపయోగపడే అంశాలను రాజ్యాంగంలో పొందుపరిచారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేవు శ్రీనివాసరావు, జల్లి ఏడుకొండలు, మల్లవరపు శ్రీనివాసరావు, ఉందుర్తి చంద్రరావు, సవరపు నరేష్, పెదపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరైన కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



కాకినాడ, మేజర్ న్యూస్ : దేశ రాజధాని న్యూఢిల్లీలో సోమ వారం జరిగిన లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె అంజలి బిర్లా వివాహ రిసెప్షన్‌కు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ హాజరయ్యారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలసి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొనగా, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర క్యాబినెట్ మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అతిరథ మహారథులు వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** భారతదేశంలోని అన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యాన్ని హక్కులను కల్పిస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని పొందుపరిచారని నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్చార్జి తలారి వెంకట్రావు అన్నారు. మంగళవారం కొవ్వూరు బస్టాండ్ సెంటర్ వద్ద రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి పౌరుడు స్వేచ్ఛ స్వాతంత్రంతో జీవించాలని కుల, మత వివక్షత లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులను కల్పిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించడం జరిగిందన్నారు. నేడు రాష్ట్రంలో మాయ మాటలతో అధికారం దక్కించుకున్న రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగంలో కల్పించబడిన హక్కులకు భంగం కల్పిస్తూ పరిపాలన చేస్తున్నారన్నారు. ఇసుక మద్యం అంత అవినీతిమయమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రుత్తల భాస్కరరావు, కొవ్వూరు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, కంటమణి రమేష్, బత్తి నాగరాజు, చాగల్లు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లింపుల దుర్గా మల్లేశ్వరరావు, చాగల్లు ఎంపీపీ మట్టా వీరస్వామి, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసి బాబు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అప్పలరాజుపేటలో శ్రీహనుమాన్ విగ్రహ ప్రతిష్ట



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం మంగళవారం జరిగింది. స్వర్గీయ కేదారి చంద్రరావు కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారం, గ్రామస్తులు కృషితో విగ్రహ ప్రతిష్ట ఘనంగా చేశారు. విశాఖ జిల్లా భీమిలి నుండి సద్గురు సేవా ఆశ్రమం సాయిబాబా స్వామి, వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు చేసి శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట చేశారు. హనుమంతు నూకరాజు, కొట్టు నూకరాజు, సేనాపతి శ్రీను దంపతులు పేటల మీద కూర్చొని పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కేదారి సూర్యనారాయణ, కేదారి సత్తిబాబు, గ్రామానికి చెందిన యువకులు, మహిళలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## ఐదు దశాబ్దాలు ఏజెన్సీలో వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలను పొందిన శేషారావు మృతి



**కూనవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో ప్రధానంగా కూనవరం విఆర్ పురం వెంకటాపురం మండలాల్లో వైద్య సేవలు అందించి ప్రజల పొందిన బి శేషారావు మంగళవారం తెల్లవారు జామున వైజాగ్‌లో మృతి చెందారు. మరణ వార్త తెలియగానే ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తపరిచారు శేషారావు కూనవరం ప్రభుత్వ వైద్యులుగా పనిచేశారు రిటైర్డ్ అయిన అనంతరం కూనవరంలోని ప్రాక్టీస్ చేస్తూ సేవలందించారు. ప్రతి వ్యక్తిని పలకరిస్తూ కుటుంబ విశేషాలు యోగక్షేమాలు అడుగుతూ వైద్య సేవలు అందించేవారు పేషెంట్స్ డాక్టర్ మాటలకు వ్యాధిని మరిచిపోయి ఆనందంగా మాట్లాడేవారు. చిన్ననాటి నుండి మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన శేషారావు పేద ప్రజల పట్ల ప్రేమను కనపరిచేవారు స్వతహాగా వామపక్ష భావాలు కలిగిన వ్యక్తి శేషారావు 1983లో ఎన్టీఆర్ టిడిపి ఏర్పాటు చేసిన తర్వాత తెలుగుదేశం పట్ల అభిమానం కనపరిచేవారు. డాక్టర్ బి శేషారావుకి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు శేషారావు మరణం ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటుగా భావిస్తారు.

## రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట తనిఖీలతో హడల్










**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

కాకినాడ రూరల్ మండలం నడకుదురు గ్రామంలో గల ఓ షాటెక్స్ మిల్లులో పదుల సంఖ్యలో తెలంగాణ నుంచి వచ్చిన లారీల్లో పచ్చి బియ్యం వచ్చి దిగుతున్నాయి. పెద్ద పెద్ద కార్లు వచ్చి ఈ షాటెక్స్ గొడౌన్ ముందు ఆగాయి. అందులో నుంచి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, జనసైనికులు దిగారు. పోలీసులకు, పౌరసరఫరాల జిల్లా అధికారి ప్రసాద్‌కి సమాచారం ఇచ్చారు. తనిఖీలు చేశారు. పోలీసులు పది నిమిషాల్లో వచ్చేసారు. కానీ డిఎస్ఓ ప్రసాద్ రాలేదు. ఛైర్మన్ తోట సుధీర్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా నెంబర్ బిజీ... దాంతో ఛైర్మన్ సుధీర్ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌కి సమాచారం ఇచ్చారు. అయినా డిఎస్ఓ జాడ లేదు. అలా నాలుగు గంటలు పైగా గడిచిపోయాయి. ఛైర్మన్ తోట సుధీర్ ఏకాకిగా అక్కడే అలా ఉన్నారు. ఇంతలో మీడియా చేరుకుంది. ఛైర్మన్ తోట సుధీర్ తీవ్రంగా స్పందించారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టిలో పెడతానని చెప్పడంతో ఆ అధికారులు ఉరుకులు పరుగుల మీద వచ్చారు. టెక్నికల్ టీం చివరికి అక్కడికి చేరుకుని...అన్ని బియ్యం బస్తాలను పరిశీలించారు. కొన్ని బస్తాలలో పోర్టిఫైడ్ రైస్ కనుగొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో చైర్మన్ తోట సుధీర్ మాట్లాడుతూ చాలా పెద్దయెత్తున తెలంగాణ రాష్ట్రం నుంచి అక్కడ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని ఇక్కడికి తరలించి అక్రమ వ్యాపారం చేస్తున్నారని సమాచారం రావడంతో తనిఖీలు చేసినట్లు చెప్పారు. ఐదు లారీల్లో పిడిఎస్ రైస్‌గా అనుమానించేలా ఎటువంటి బిల్లులు లేకుండా రైస్ రావడం జరిగిందని చెప్పారు. ఒక లారీ మణికంఠ ఇండస్ట్రీస్ నుంచి వచ్చిందని అన్నారు. అధికారులు పూర్తిగా పరిశీలన చేసి వివరణ ఇవ్వాలని కోరారు. తమకు అక్రమ వ్యాపారంపై పూర్తి సమాచారం వచ్చిందని ,దానిపై తనిఖీ చేసి వాస్తవాలు ప్రజలకు తెలియజెప్పాలని అన్నారు. రూ 35 రూపాయల కేజీ బియ్యం ఎలా అమ్ముతున్నారని... వారికిధాన్యం ఆ ధరకు ఎక్కడి నుంచి వస్తున్నాయని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్ విస్మయం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున రైస్ మిల్లుల ద్వారా అక్రమంగా చౌక ధరల పేదల బియ్యం సేకరణ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని ఇటువంటి అక్రమాలకు చూస్తూ ఉపేక్షించేది లేదని చైర్మన్ తోట సుధీర్ మీడియాతో అన్నారు.

**తారాస్థాయిలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అవినీతి..**

కాకినాడ జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్ విధులు అందరినీ విస్మయం చేస్తున్నాయి. పెద్ద మొత్తంలో మంత్రి తనిఖీలు చేసి పిడిఎస్ బియ్యాన్ని వేలమెట్రిక్ టన్నులను సీజ్ చేయిస్తే... ఏ విధంగా రిలీజ్ చేయించారు ఆయనకే తెలియాలి. సీజ్ కాబడిన షాటాక్స్ మిల్లులు తిరుగు ప్రారంభించి మళ్లీ అవే అక్రమాలు చేయడం చూస్తుంటే డిఎస్ఓ సహకారం ఎంత ఉందనేది అర్థమవుతుంది. కోట్లాది రూపాయలు వ్యవహారంలో చేతులు మారినట్లు తెలుస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న నిత్యవసర సరుకులు అందరికీ సక్రమంగా సరఫరా కాపాడాలంటపౌరసరఫరాలసంస్థలోని అధికారుల పాత్ర చాలా ముఖ్యమైనది.. పేద ప్రజలకు నాణ్యమైన నిత్యఅవసరాలు పక్కాగా అందాలి అంటే ఈ అధికారి పాత్ర చాలా కీలకమైనది. పూర్తి బాధ్యతారాహిత్యమం... లంచగొండితనం ఇతని విధుల పట్ల కలెక్టర్ షాన్‌మోహన్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు. పెద్దయెత్తున పిడిఎస్ రైస్‌తో ఈ షాటెక్స్ గొడౌన్ మంత్రి తనిఖీల్లో దొరికితే, వెంటనే రిలీజ్ చేయడం, వాళ్ళు తిరిగి మళ్ళీ అదే అక్రమాన్ని చేయడం వెనుక డిఎస్ఓ అవినీతి ఉందని అక్కడే బహిరంగంగా చెబుతున్నారు. అందుకే సాక్షాత్తు చైర్మన్ నాలుగు గంటల పాటు రేఖగా వదిలేసినట్లుగా చర్చి సాగింది.దీనిపై ఏమి జరుగుతుందో వేచి చూద్దాం...

# 28న నగరానికి ఉడిపి స్వామీజీ రాక




కాకినాడ, మేజర్ న్యూస్ : ఉడిపి అష్ట పీఠాలలో ఒకటైన శిరూర్ మఠ పీఠాధిపతులు వేదవర్ధన తీర్థ స్వామీజీ ఈనెల 28వ తేదీన ఉదయం11 గం.లకు నగరానికి వస్తున్నారు. స్థానిక రాఘవేంద్ర స్వామి మఠంలో స్వామీజీకి ఘన స్వాగతం పలుకుతారు. అనంతరం స్వామీజీ పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులను ఆశీర్వదించి అనుగ్రహ భాషన చేస్తారు. కాకినాడ పరిసర ప్రాంతాలలో ఉన్న భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామీజీ అనుగ్రహాన్ని పొందాల్సిందిగా రాఘవేంద్ర స్వామి మఠప్రధాన అర్చకులు రవీంద్ర భట్ కమిటీ కోశాధికారి వై వెంకటేష్ సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు.ఇతర వివరాలకు 94403 02766 సంప్రదించవచ్చని వెంకటేష్ తెలిపారు. కాకినాడ మధ్వసభ కమిటీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ యాతగిరి పరశురామ్ మాట్లాడుతూ వేదవర్ధన తీర్థ స్వామీజీ అపార జ్ఞాన సంపన్నులని చెప్పారు. ఇటీవల ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామీజీ ముంబై నగరములో చాతుర్మాస్య దీక్ష కార్యక్రమాన్ని సుమారు రెండు మాసాల పాటు అద్భుతంగా నిర్వహించారని, అందులో శ్రీ వేదవర్ధన తీర్థస్వామీజీ తమ చాతుర్మాస్యవ్రతాన్ని కూడా నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు అక్కడే నిర్వహించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రెండు మాసాల పాటు శ్రీహరివాయు స్తుతిపై అద్భుతంగా ప్రసంగిస్తూ వాటిలోని ఆధ్యాత్మిక విషయాలను వివరించారని అన్నారు. ఉత్తరాధిమఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామిజి చేత ప్రత్యేకంగా ప్రశంసలు పొందడమే కాక మఠం తరఫున నిత్యపూజకు అవసరమైన రజిత కలశాన్ని అందజేసి ప్రత్యేకంగా సత్కరించిన ఆ సువర్ణ క్షణాలను పండితులు మరియు భక్తులు నేటికీ స్మరించుకోవడం గొప్ప విషయంగా పరుశురామ్ ప్రస్తావించారు. ఈ ముంబై చాతుర్మాస్య పూజా కార్యక్రమాన్ని నిర్వహించడంలో సత్యధ్యాన విద్యాపీఠ ఉపకులపతి పండిత మాహూలీ ఆచార్ల దీక్ష దక్షతను ఇరువురు స్వామీజీలు ప్రశంసించిన విషయం భక్త లోకానికే అందించిన అపూర్వ ఆధ్యాత్మిక సంపదగా నేటికీ కీర్తిస్తూ ఉంటారని వివరించారు. అంతటి మహానుభావులైన శ్రీ వేద వర్ధన తీర్థస్వామీజీ కాకినాడ నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ పాల్గొని గురువుల అనుగ్రహాన్ని పొందాల్సిందిగా కోరారు. విజయనగరంలో యాతగిరి భీమాచార్ పర్యవేక్షణలో స్వామిజీకి అపూర్వరీతిలో ఏర్పాట్లుచేసారని శిరూర్ మఠ దివాన్ ప్రతినిధి అక్షయ ఆచార్ తెలిపారు. అనంతరం విశాఖలో 26నుండి మూడురోజు పాటు శ్రీరాఘవేంద్రస్వామి మఠం మరియు యాతగిరి హరి ఆచార్ల ఆధ్వర్యంలో కార్యక్రమాలలో పాల్గొని 28 మధ్యాహ్నం కాకినాడ చేరుకుంటారు.

# రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి



రౌతులపూడిలో 75 వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉద్యోగుల ,ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహ ఆవరణం లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మరియు మార్కెట్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలదండలతో నివాళులర్పించి రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.నేటికి భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా రాజ్యాంగ విలువలను కాపాడవలసిన భాద్యత మనందరిమీద ఉందన్నారు. ఉపాధ్యాయులు కన్వీనర్ నెమ్మాది సింహాచలం అన్నారు. ఈ కార్యక్రమంలో యుటీఫ్ మండల అధ్యక్షులు కె.హరిబాబు,తాతబాబు, రాష్ట్ర ఆదివాశీ సంఘ అధ్యక్షులు.జి సత్తిబాబు అంబేద్కర్ యూత్ లీడర్స్ బ్రే రాజేశ్వరరావు, గంటా భాస్కర్ వీరభద్రరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం కొండయ్యపాలెం శారదమ్మగుడి వద్ద ఉన్న నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ విలువలు పాటిస్తామంటూ నగరపాలక అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శిరీష్, అకౌంటెంట్ సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆదిత్యలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్ల ఓరియంటేషన్ కార్యక్రమం






కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు ఎన్.ఎస్.ఎస్. ఓరియంటేషన్ కార్యక్రమం అలాగే రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆ కళాశాల ఎన్.ఎస్.ఎస్. బృందం వారు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి.కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ జాతీయ సేవా పథకం భారతప్రభుత్వం చేత 1969 సంవత్సరంలో ప్రారంభించబడిన యువజన కార్యక్రమం దేశ పురోభివృద్ధికి, విద్యార్థులు తోడ్పదతారు. సంఘసేవ చేయడం అనేది విద్యార్థిదశనుంచే అలవరుచుకోవాలి అనే ఉద్దేశ్యంతో జాతీయ సేవా పథకం ప్రారంభమయ్యిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుతున్న నేటి యువతను చదువు, విజ్ఞానంతోపాటు సమాజం పట్ల భాధ్యత సేవా గుణం పెంపొందాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ జాతీయ సేవా పథకాన్ని ఎన్.ఎస్.ఎస్. నేషనల్ సర్వీస్ స్కీమ్, అనగా జాతీయ సేవా పథకం అంటారు అని ఆమె తెలిపారు. నాట్ మీ బట్ యు అనే నినాదం తత్వశాస్త్రాన్ని చెబుతుందని, కాబట్టి ప్రతి వాలంటీర్ సమాజ అభివృద్ధికి పాటుపడాలి అని ఆమె తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం మరియు ఓరియంటేషన్ ప్రోగ్రాం పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిధి డా॥ మానికిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లుగా సేవచేసే విద్యార్థినులు తమ జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్ళేందుకు కావలసిన మెలకువలు అన్నీ అలవరుచుకుంటారని, ప్రస్తుతం ఉన్న అధికారులు ఎక్కువ శాతం వాలంటీర్లుగా సేవ చేసినవారే గమనార్హం అని అన్నారు. అలాగే వాలంటీర్లను అభినందిస్తూ సర్టిఫికేట్లను బహుకరించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జెఎన్టీయుకె ప్రొఫెసర్ డా॥ ఆళ్ళపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రతీ సంవత్సరం నవంబరు 26న జరుపుకుంటారని తెలిపారు. నిహమారా సంవిధాన్, హమారా స్వాభిమాన్ నినాదంతో ఈ పడావి 75వ భారత రాజ్యాంగ దినోత్సం జరుపుకుంటామని తెలిపారు. ప్రజలు మరియు విద్యార్థినులు రాజ్యాంగ చట్టాలను అర్ధం చేసుకుని మెలగాలని, దేశ భవిష్యత్తును అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్ జాతీయ సేవా పథక కార్యనిర్వహణాధికారులు పి.సురేఖదేవి, ఎమ్.శ్రీనివాస్, ఉపకార్య నిర్వహణాధికారులు కె.నవ్య, ఎన్.సత్యవతి మరియు అధిక సంఖ్యలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## శ్రీ షిరిడిసాయిబాబా ఆలయ ప్రాంగణంలో వాయులింగం ప్రతిష్ట

**– ఏజెన్సీలో 830 హనుమాన్ విగ్రహాలు ఉచితంగా అందజేశాం**
**– సద్గురు సేవ ఆశ్రమం స్వామీజీ సాయిరాం**



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్** : రాజవొమ్మంగి శ్రీ శిరిడి సాయి బాబావారి ఆలయ ప్రాంగణంలో వాయు లింగం ప్రతిష్టి మంగళ వారం జరిగింది. విశాఖజిల్లా భీమిలి సద్గురు సేవా ఆశ్రమం సాయిరాం స్వామి,వేదపండితులు వేద మంత్రాలు, హెూమాలు నిర్వహించి ఆమహా శివుని వాయులింగ ప్రతిష్ట చేశారు. మండలాని కి చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పంచామృత అభిషేకాలుచేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

–ఏజెన్సీ లో 830 హనుమాన్ విగ్రహాలు అందించాం : సద్గురు సేవ ఆశ్రమం స్వామిజీ సాయిరాం

ఏజెన్సీలో ఇప్పటివరకు 830 హనుమాన్ విగ్రహాలు ఉచితంగా ఇవ్వడం జరిగిందని విశాఖ జిల్లా భీమిలి సద్గురు సేవా ఆశ్రమం స్వామీజీ సాయిరాం స్థానిక విలేకర్లకు తెలిపారు. 1000 విగ్రహాలు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మరో 170 విగ్రహాలు కావలసిన వారికి అంద చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు9848649067కు సంప్రదించాలన్నారు. తూపాటి వీర్రాజు,మాడవెంకటేశ్వరరావు,అమ్మాజీ, సీతారామరాజు, బివిఎస్ఎన్ గుప్తా తదితరులు కార్యక్రమాన్ని పర్వేక్షించారు.

## కార్తీక వన సమారాధనలు ఐక్యతకు ప్రతీకలు - ఆర్డీఓ శ్రీరమణి



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్** : కార్తీక మాసంలో కార్తీక వనస మారాధనలు ఐక్యతకు ప్రతీకలు అని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి పేర్కొన్నారు. మంగళవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న స్థానిక ఉసిరి చెట్టు వద్ద కార్తీక మాసం పురస్కరించుకుని, ఆర్డీఓ శ్రీరమణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్తీక మాసంలో ఉసిరి చెట్టు వద్ద పూజలు చేసి వన సమారాధన చేయడం ఎంతో పవిత్రమైనదని ఆమె పేర్కొన్నారు. దీనిలో భాగంగా వన సమారాధన నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, డివిజన్‌లోని పలువురు తహశీల్దార్లు, ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డిటి ఎం.వి.వి.భానుకుమార్, కాంతారావు, పలువురు డివిజన్‌లోని డిప్యూటి తహశీల్దార్లు, నారాయణ, దయానందరాజు, సత్తిబాబు, పలువురు కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

## చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



చింతూరు, మేజర్ న్యూస్ : చింతూరు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. రత్న మాణిక్యం తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తొలుత భారత రాజ్యాంగ పితామహుడు డా. బి. ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచ రాజ్యాంగాల్లో పెద్ద రాజ్యాంగం అని, 395–ఆర్టికల్స్, 8 – షెడ్యూల్స్, 22 – భాగాలుగా మూల రాజ్యాంగం నిర్మించబడిందన్నారు. 26 నవంబర్ 1949లో రాజ్యాంగాన్ని ఆమోదించారని, 26 జనవరి 1950 నుండి అమలు చేసారన్నారు. 26 జనవరి 1930 లాహెూర్ సమావేశంలో జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్యాన్ని ప్రకటించుకుంది, ఆరోజుకు ప్రాముఖ్యతను కల్పించడం కోసం 26 జనవరి 1950లో అమలు చేయడం జరిగిందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎమ్.శేఖర్ మాట్లాడుతూ రాజ్యాంగం కుల, మత, వర్గ, ప్రాంతీయ విచక్షణ లేకుండా భారతీయులందరికి సమాన హక్కులు, అవకాశాలను రాజ్యాంగం కల్పించిదన్నారు. రాజనీతి శాస్త్ర విభాగాదిపతి ఎస్ అప్పనమ్మ మాట్లాడుతూ ప్రవేశిక యొక్క ప్రాధాన్యతను, రాజ్యాంగానికి ప్రవేశిక ముందుమాటగా ఏ విధంగా పరిగణలోకి వస్తుందో తెలియజేసారు. అనంతరం రాజ్యాంగ పీఠికకు సంబంధించిన ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.వెంకట్రావు, ఆర్.సిహెచ్. నాగేశ్వరరావు, కె.శకుంతల, జి.హారతి, కె.శైలజ, కె.శ్రేదేవి, కె.శ్రీలక్ష్మి, జి.సాయికుమార్, ఎన్.రమేష్, బి.శ్రీనివాసరావు, పి.సుభద్ర, ఎస్.మూర్తి, వి.శీనయ్య, సంగం నాయుడు తదితర అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జెఎన్టీయుకెలో ఘనంగా 75వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు









కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్టియుకె ప్రాంగణంలో మంగళవారం ఉదయం 75వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను సెనేట్ హాలు నందు ఘనంగా నిర్వహించారు. జెఎన్టియుకె ఎస్సీ, ఎస్టీ లైజనింగ్ ఆఫీసర్ ఎం.కుమారస్వామి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేయగా అతిథులుగా రెక్టార్ ప్రొ. కె.వి.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి.రవీంద్రనాథ్, ఓఎస్‌డి ప్రొ. డి.కోటేశ్వరరావులు వేదికనలంకరించగా విశిష్ట అతిథిగా విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ ప్రొఫెసర్ డా.జి.సత్యనారాయణ విచ్చేశారు. ఈ సందర్భంగా అతిథులు డా. బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య దేశంగా అవతరించిన మన దేశానికి దిక్సూచి భారత రాజ్యాంగం అన్నారు. బుద్ధుని బోధనల ద్వారా డా.బి.ఆర్.అంబేద్కర్ ప్రభావితమై దాని యొక్క భావ సారూప్యతను భారత రాజ్యాంగంలో పొందిపరచడం జరిగిందన్నారు. ప్రతీ ఒక్కరు విద్యార్థి దశ నుండే రాజ్యాంగంపై అవగాహన పెంచుకుని ఇతరులకు కూడా రాజ్యాంగం యొక్క ఆవశ్యకతను వివరించాలన్నారు. విశిష్ట అతిథి డా.జి.సత్యనారాయణ మాట్లాడుతూ 75 సంవత్సరాల నుండి భారతదేశం ఆర్థిక అసమానతలు లేని దేశంగా మరియు సమైక్యంగా ఉండటానికి కారణం భారత రాజ్యాంగమేనన్నారు. భారత రాజ్యాంగం అనేది ఎప్పటికీ రాజ్యాంగ విలువలను అందరికీ తెలియజేసి దాన్ని రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముందుగా డా.బి.ఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద మరియు యూనివర్శిటీ ప్రాంగణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కాంస్య విగ్రహాలకు అతిథులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అతిథులు ప్రతీ ఒక్కరి చేత భారత రాజ్యాంగ పీఠికను చదివింపజేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, స్పెషల్ ఆఫీసర్‌లు, యుసిఇకె ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, టీచింగ్&నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 19న రాజమండ్రిలో వధూవరుల పరిచయ వేదిక

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్ర మధ్వ సమాఖ్య కమిటీ సమావేశం ఆంధ్ర మధ్వ సమాఖ్య ఉపాధ్యక్షులు డాక్టర్ యాతగిరి పరుశు రామ్(జర్నలిస్ట్). అధ్యక్షత జరిగింది. ఈ సమావేశంలో వధూవరుల పరిచయ వేదిక. 2025 జనవరి 19వ తారీఖున ఆదివారం నాడు రాజమండ్రిలో మల్లిక సత్రం నందు నిర్వహించాలని తీర్మానించారు. గతంలో సమాఖ్య అధ్యక్షులుగా వున్న కాకినాడ మధ్వసభ కమిటీ అధ్యక్షులు స్వర్గీయ రాచూరి రాఘవేంద్రస్వామి ఆధ్వర్యంలో 2022లో వధూవరుల పరిచయ వేదిక ఘనంగా నిర్వహించగమేకాక వందలాది జంటలకు వివాహనిశ్చయాన్ని కూడా జరిపించారని సమావేశంలో గుర్తు చేసుకున్నారు. అదే స్ఫూర్తితో వధూవరుల పరిచయ వేదిక 2025 జనవరి 19న ఘనంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నామని మరియు పలువురి విజ్ఞప్తి మేరకు తిరిగి వధూవరుల పరిచయ వేదిక నిర్వహించాలని సమావేశంలో అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. కార్తీకమాస సందర్భంగా సమాఖ్య ఆధ్వర్యంలో పెద్దాపురంలో కార్తీకమాస సమారధన మరియు ధాత్రిహెూమ కార్యక్రమాలు గ్విజయంగా నిర్వహించడం జరిగిందని అందుకు సహకరించిన అందరికీ సమావేశంలో ధన్యవాదాలు తెలుపుకున్నారు. ముఖ్యంగా రాజమండ్రి ఉత్తరాధి మఠాధికారి సుధాపండితులు విజయసింహాచార్ పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం ద్వారా కార్తీక మాస వైభవం మరియు మన గురువుల విశేషాలను వివరించి అందర్ని ధన్యులను చేసారని సమావేశంలో ప్రస్తావిస్తూ నమస్కారపూర్వక కృతజ్ఞతలు తెలుపుకున్నారు. కార్తీకమాస సమారధన నిర్వహణకు జమ్మి కృష్ణారావు అందించిన సహకారానికి సమావేశం ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంది. ఈ సమావేశంలో రాచూరి శేషగిరిరావు, సాల్వ పంతులు రాఘవేంద్రరావు, చట్టి హనుమంతరావు, రాచురి కళ్యాణ్ చక్రవర్తి, కందాలం నరసింహారావు, మజిందార్ రామారావు, కృష్ణద్వైపాన్రావు, కాకలవరపు భరణి పాల్గొన్నారు. ఆరోజు వచ్చిన వారందరికీ భోజన వసతి ఏర్పాటు చేయడానికి సమావేశంలో నిర్ణయించారు. పెళ్లికూతురు, పెళ్ళికొడుకు, వారి తరపున తల్లిదండ్రులు వచ్చిన వారికి ఈ భోజన వసతి ఏర్పాటు ఉంటుందని, శనివారం రాత్రికి ఎవరైనా వచ్చినా సత్రం హాల్లో ఉండవచ్చునని అన్నారు.

## అన్ని కులాలు వర్గాల ప్రజలకు సమాన హక్కులను కల్పించడమే లక్ష్యంగా భారత రాజ్యాంగం రూపకల్పన




కొవ్వూరు, మేజర్ న్యూస్ : సమాజంలో ప్రతి పౌరుడు స్వేచ్ఛ స్వాతంత్రంతో జీవించాలని అన్ని కులాలు వర్గాల ప్రజలకు సమాన హక్కులను కల్పించడమే లక్ష్యంగా భారత రాజ్యాంగం రూపొందించబడినదని కొవ్వూరు మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి తెలిపారు.

మంగళవారం కొవ్వూరు పట్టణంలోని మెరకవీధి నాలుగో వార్డ్‌లో భారత రాజ్యాంగ దినోత్సవం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశంలోని అన్ని వర్గాల ప్రజలు సమాన స్వేచ్ఛ జీవితాన్ని పొందాలని సంకల్పంతో రాజ్యాంగం ద్వారా హక్కులను కల్పించారని అన్నారు. ప్రతి యువత డాక్టర్ బి.ఆర్అంబేద్కర్‌ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు భావన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రంను పరిశీలించిన ఎంఈఓ వి.ఆర్.కె.చౌదరి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో స్థానిక మహాత్మా గాంధి మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో సమగ్ర శిక్షా ద్వారా నడపబడుతున్న భవిత కేంద్రం నందు మంగళవారం పెద్దాపురం మండల విద్యాశాఖాధికారి–2 వి.ఆర్.కె.చౌదరి ఫిజియోథెరపి పరిశీలించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపి కేంద్రంలో ప్రతీ మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించబడుతుందని భవిత పిల్లల తల్లితండ్రులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఓ తెలిపారు.

మండలంలోని శారీరక వైకల్యం, మెదడు పక్షవాతం గల దివ్యాంగ పిల్లలకు ఈ భవిత కేంద్రంలో ప్రతీ మంగళవారం జరిగే ఫిజియోథెరపి సేవలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలనిన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియోథెరపిస్ట్ వి.అపర్ణ, భవిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## "ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. ద్వారా తీరప్రాంత క్లీనింగ్ డ్రైవ్"



గండేపల్లి, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చొరవలో భాగంగా, ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల, సూరంపాలెం లో ఫోరెన్సిక్ సైన్స్ ఎన్.ఎస్.ఎస్. విభాగం పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడానికి కోస్టల్ క్లీనింగ్ డ్రైవ్ ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ విలాస్ అనిల్ చవాన్ తెలిపారు. కాకినాడ సముద్ర తీరం వెంబడి చెత్త,ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరిచే కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి వి నాగేశ్వర్ రావు, మరియు ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.కె. విద్యా సాగర్, 50 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.

ఒక మంచి కార్యక్రమంలో భాగస్వాములు కావడం పట్ల విద్యార్థులను ఎన్.ఎస్.ఎస్. బృందాన్ని ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్ అభినందించారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**అనపర్తి,మేజర్‌న్యూస్ :** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అనపర్తిలోని శ్రీమతి ద్వారంపూడి బుల్లెమ్మాయి జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవే నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సేవలను వివరించుకున్నారు. విద్యార్థులందరూ అంబేద్కర్‌ను పూర్తిగా తీసుకొని, వారి అడుగుజాడల్లో నడవాలని అన్నారు. రాజ్యాంగ పీఠికను చదివించారు. పోస్టల్ శాఖకు చెందిన ప్రశాంత్ చే ఏర్పాటు చేయబడిన నాణాల ప్రదర్శనను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు . ప్రదానోపాధ్యాయిని కర్రి కళ్యాణి మాట్లాడుతూ విద్యార్థులు వారి పాఠాలలో చదివిన వివిధ దేశాల కరెన్సీని ప్రత్యక్షంగా చూడటం ద్వారా వారిలో ఆసక్తి పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యాబాల మందిర్‌లో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



కొత్తపేట, మేజర్‌న్యూస్ :75వ భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా విద్యా బాలమందిర్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి కరస్పాండెంట్ ఆర్ అనురాధ గారు పూలదండ వేసి నివాళులర్పించారు. పాఠశాల అసెంబ్లీలో విద్యార్థులచే రాజ్యాంగ ప్రతిజ్ఞ తెలుగు మరియు ఇంగ్లీషు భాషలలో చేయించారు.

ఆర్ అనురాధ గారు మాట్లాడుతూ 2015 న రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా పిఎం మోడీ నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం గా ప్రకటించారు. దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం ,సౌభ్రాతృత్వాలను అందిస్తూ రూపొందించబడి 1949 నవంబర్ 26న ఆమోదించబడిన భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ ,తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నూకపెయ్యి శివరత్నం పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మెప్మా అర్బన్ మార్కెట్‌లో స్టాల్స్ ఏర్పాటు



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో మంగళ వారం మెప్మా అర్బన్ మార్కెట్ మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి సూచనలతో నిర్వహించడం జరిగింది. మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన పలు ఉత్పత్తులు, తినుబండారాలు, వస్త్రాలు, అల్లిక వస్త్రాలు, వివిధ రకాల పచ్చళ్ళు, స్నాక్స్‌కు సంబంధించి 18 రకాల స్టాల్స్ ఈ మార్కెట్ నందు ప్రదర్శించారు.

ఈ సందర్భంగా మెప్మా సిఎంఎం జి.భ్రమరాంబ తెలుపుతూ ప్రతీ నెల మెప్మా అర్బన్ మార్కెట్ పురపాలక సంఘ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, ముఖ్యంగా మహిళలను ఆర్ధికంగా ప్రోత్సహించేందుకు ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఒలు శ్రీదేవి, నర్గీస్, ఆర్‌పిలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
తూర్పుగోదావరి
బుధవారం,
27 నవంబర్ 2024
4

## ఈ నెల 30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



పెద్దాపురం, మేజర్ న్యూస్ : ఈ నెల 30వ తేదిన ఉదయం 10.30 గంటలకు, మున్సిపల్ కౌన్సిల్ హాలు నందు కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించబడునని, కమీషనర్ కె.వి.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొననున్నారని, కమీషనర్ తెలిపారు. కావున పురపాలక సంఘ వివిధ శాఖల విభాగాధిపతులు విధిగా హాజరు కావాలని, కమీషనర్ తెలిపారు.

## డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి




**అనపర్తి, మేజర్ న్యూస్ :** భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవం సందర్భంగా ప్రతి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం మండలంలోని, రామవరం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నేతృత్వంలో భారత రాజ్యాంగం నిర్మాణ కమిటీ రాజ్యాంగ రచన కమిటీ అనేక రోజులు కష్టపడి రాజ్యాంగంలో వివిధ అంశాలు పొందుపరిచి 1949 సంవత్సరం నవంబర్ 26వ తేదీన పార్లమెంట్ నందు ప్రవేశపెట్టారని మన రాజ్యాంగం మనకు సమానత్వం, స్వేచ్ఛ మరియు న్యాయాన్ని కల్పించే ఒక గొప్ప మార్గదర్శకంగా నిలిచిందని అన్నారు. ప్రతి పౌరుడికి హక్కులను రక్షించడంలో ఇది ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. అంబేద్కర్ సేవలు నేటి పౌరులందరికీ మార్గదర్శకాలుగా నిలిచేయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వర్కర్లు ధర్నా

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక ఉద్యోగ కర్షకుల సంక్షేమం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు జిల్లా కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు నినాదాలు ర్యాలీ చేస్తూ రంపచోడవరం ఐటీడీఏ వద్ద స్కీం వర్కర్లు మంగళవారం ధర్నా చేశారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ ఆందోళన వద్దకు వచ్చి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందుకున్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.శాంతిరాజు అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల, జిల్లా కోశాధికారి కే.రామలక్ష్మి మాట్లాడుతూ మూడవసారి కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్మిక ఉద్యోగ కర్షకుల పట్ల వినాశకర విధానాలు తీసుకొస్తూ కేవలం కార్పొరేట్లకు లాభాలు కోసమే ఊడిగం చేస్తున్నదని ఆరోపించారు. అందుకే 15 లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీ చేశారని తెలిపారు. కార్మికులకు నష్టం తెచ్చే నాలుగు లేబర్ కోడ్లు తెస్తున్నదని వ్యవసాయ రంగంలో మూడు నల్ల చట్టాలను రైతులు సంవత్సరంపాటు పోరాడి రద్దు చేసుకున్నట్లుగా లేబర్ కోడ్స్ రద్దు చేసేంతవరకు పోరాటాలు చేయాలన్నారు. ధరలు






300 రెట్లు పెరిగినా కార్మికులకు కనీస వేతనం 26 వేలు అమలు చేయకపోవడం దారుణం అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక రైతుల ఆత్మహత్యలు గణనీయంగా పెరిగాయని అన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలని, ఉపాధి హామీ పథకం పటిష్టంగా అమలుచేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, విశాఖ ఉక్కు రక్షణకై పాటుపడాలని స్కీమ్ వర్కర్స్ జీతాలు పెంపుదల కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేయాలని పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, మహిళల రక్షణకై ప్రత్యేక చట్టాలు అమలుపరచాలని ప్రజా పంపిణీ పథకం సమగ్రంగా అమలుచేయాలని నిరుద్యోగ సమస్యకు పరిశ్రమలు నెలకొల్పాలని తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు ప్రజలను సమీకరించి ఐక్యఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈ.సిరిమల్లెరెడ్డి, సిఐటియు యూనియన్ నాయకులు కొమరం చెల్లాయమ్మ, కె.మంగాయమ్మ. కె.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీ సీజ్



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** మండలంలోని తాడిపూడి గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ పట్టుకుని పరిశీలించగా వారి వద్ద ఎటువంటి అనుమతులు లేవు. లారీని మరియు 6 యూనిట్ల ఇసుకని స్వాధీనపరుచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.రాము తెలిపినారు.

## రాజ్యాంగ ప్రదాత అంబేద్కర్

**– బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్**
**– మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు, పిఠాపురం జనసేన నాయకులు బి.ఎన్ రాజు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** రాజ్యాంగ ప్రదాత, అట్టడుగు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని పిఠాపురం జనసేన నాయకులు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిఎన్ రాజు అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా పిఠాపురం స్థానిక రథాలపేట సెంటర్ నందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బి.ఎన్.రాజ్. మాట్లాడుతూ... అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కారణంగానే అట్టడుగు బడుగు బలహీన వర్గాల ప్రజలకు చట్టసభల్లో స్థానం, రిజర్వేషన్ ఫలాలు అందాయని అన్నారు. అత్యంత శక్తివంతమైన భారత రాజ్యాంగాన్ని పాలకులు పటిష్టంగా అమలు చేయవలసిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ అంబేద్కర్ ఆలోచన విధానంలో నడుస్తూ... ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా పనిచేస్తు న్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

**– ముఖ్య అతిథిగా పాల్గొన్న డివైఇఓ ప్రభాకర శర్మ**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలోని జెఎన్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివైఇఓ ఈరంకి ప్రభాకర శర్మ పాల్గొని మాట్లాడుతూ భారత రాజ్యాంగం గొప్పతనం గురించి, రాజ్యాంగం రచించిన వారి గురించి, రాజ్యాంగం వ్రాయడానికి పట్టిన కాలం గురించి విద్యార్థులకు ఆయన విపులంగా వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి, ముఖ్య అతిథి డివైఇఓ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.నూకరాజు, టి.త్రిమూర్తులు, జి.వి.వి.సత్యనారాయణ, జె.అపర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువులపై దృష్టి సారించాలి

**– ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం**





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువులపై దృష్టి పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నది పరిశీలించేందుకు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, అన్ని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏటిడబ్ల్యూఓ లతో ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా త్వరలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా విద్యార్థుల తండ్రులకు రోప్ లాగే ఆటను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సంక్షేమశాఖలో పనిచేయుచున్న ఉపాధ్యాయులు ప్రతిరోజు ఎఫ్ఆర్ఎస్ హాజరు వేయాలన్నారు. ఉపాధ్యాయులు ఏ విధంగా పనిచేయుచున్నది కాంప్లెక్స్ పరిధిలో నివేదికలు తయారుచేసి సమర్పించాలని సంబంధిత ప్రధానోపాధ్యాయులను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఏటిడబ్ల్యూఓలు రామ తులసి,కృష్ణమోహన్,ప్రధానోపాధ్యాయులు బి.ఎస్.కుమార్, బి.నాగేశ్వరరావు,కె.ఆర్.పి.కుమార్ పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడుల్లో400లీ. బెల్లపు ఊట ధ్వంసం



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మంగళవారం గండేపల్లి మండలంలో పాత సూరంపాలెం గ్రామంలో 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేయడం జరిగిందని,అలాగే పెద్దాపురం మండలంలో చంద్రమంపల్లి గ్రామంలో ఒక మహిళ వద్ద నుంచి ఒక లీటరు సారాయి ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కి పంపడం జరిగిందని ఎక్సైజ్ సీఐ అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సై లు పి.చిట్టి బాబు, ప్రసాదరావు మరియు సిబ్బంది పాల్గొన్నట్లు సి.ఐ.తెలిపారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహా చట్టంపై అవగాహన



పిఠాపురం, మేజర్ న్యూస్ : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఐసిడిఎస్, విద్యాశాఖ, రెవిన్యూ,పంచాయతీ, డి ఆర్ డి ఏ, వైద్య ఆరోగ్యశాఖ, సచివాలయ సిబ్బంది మరియు వివిధ శాఖల అధికారుల సమక్షంలో... కమ్యూనిటీ హాల్ నందు బాల్యవివాహ చట్టం మరియు కిశోర వికాసంపై శిక్షణ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్వో గోపాలకృష్ణ మాట్లాడుతూ... బాల్య వివాహాల నిరోధక కమిటీ సమర్థవంతంగా పనిచేసినట్లైతే క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలను నిరోధించవచ్చు అన్నారు. ఐసిడిఎస్ జిల్లా బాల రక్షణ అధికారి వెంకట్ మాట్లాడుతూ... బాల్య వివాహాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు గ్రామసాయిలో ఏవిధంగా పనిచేయాలన్న అంశంపై పలు సూచనలు చేశారు. జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... బాలలపై లైంగిక దాడులు, ఫోక్సో, బాలల వ్యక్తిగత భద్రత తదితర అంశాలను వివరించారు. పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ సుజాత మాట్లాడుతూ... కిషోర్ బాలికల్లో ఆరోగ్య సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న క్షేత్రస్థాయి సిబ్బందిచే ఐసిడిఎస్ సిడిపిఓ దుర్గాదేవి ప్రమాణ నినాదాలు చేయించారు. ఈ కార్యక్రమంలో... పలు శాఖలకు చెందిన, అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేటలో హై స్కూల్ ప్రక్కనగల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ముందుగా పూలమాలతో సత్కరించి ఇలా బహుజన్ సమాజ్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇంచార్జ్ జుత్తుక నాగేశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగాన్ని 1947 ఆగస్టు 29న ఏడుగురు సభ్యులతో కూడిన ముసాయిదా కమిటీ ఏర్పాటు అయింది. ఈ కమిటీకి బిఆర్ అంబేద్కర్ చైర్మన్ కాగా అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ ఎన్ గోపాల్ స్వామి కే యం మున్షి మహమ్మద్ సదుల్లా బిఎల్ మీటర్ డిపి సైతాన్ సభ్యులుగా వ్యవహరించారు తరువాత బిఎల్ బిట్టర్ ఆరోగ్యం సహకరించకపోవడంతో రాజీనామా చేశారు ఆయనకు బదులు ఎం మాధవరావు కమిటీలో సభ్యునిగా చేర్చారు అలాగే 1948లో సైతాన్ మరణించడంతో టిటి కృష్ణమాచారి ఆయన స్థానాన్ని భర్తీ చేశారు రాజ్యాంగ నిర్మాణంలో ముసాయిదా కమిటీ సభ్యులు ప్రధాన పాత్ర పోషించారు కమిటీ పెద్దలు రాజ్యాంగ సభలో ముసాయిదాలపై చర్చలలో ఎంతో ప్రభావం చూపాయి అలాగే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయినటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాత్రనకా పగలనకా ఎన్నో నిద్రలేని రాత్రులు గడుపుతూ ఈ యొక్క రాజ్యాంగం కొరకు ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా ఈ యొక్క రాజ్యాంగాన్ని రాయడానికి ఆయన ఎన్నో శ్రమలు పడ్డారు . భారతదేశమే కాక ఇతర దేశాలు కూడా ఈ రాజ్యాంగం అనుసరిస్తూ పరిపాలన సాగిస్తూ ఉన్నారు. ఒక జాతి కులమత బేధం లేకుండా ప్రతి ఒక్కరూ ఈ యొక్క రాజ్యాంగాన్ని తెలుసుకొని రాజ్యాంగ అనుసారముగా ముందుకు సాగాలని అలాగే బైబిల్ కురాన్ భగవద్గీత కంటే విలువైనది భారత రాజ్యాంగం అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ భారత పార్టీ వల్లూరి సత్యానందం మాల మహానాడు నాయకులు నూకతట్టు వెంకటరమణ లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ సాదే నరేంద్రబాబు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పిఠాపురం, మేజర్ న్యూస్ : పిఠాపురం పట్టణంలో జాతీయ రహదారి 216పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. చిత్రాడ గ్రామానికి చెందిన పెట్ల దుర్గాప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి తాడిపత్రి నుండి చిత్రాడ వస్తుండగా అతివేగంతో ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య, అత్త, చిన్న పాపకు తీవ్ర గాయాలు కాగా వారిని పోలీసులు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## కానూరు పంచాయతీ వద్ద రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుక



పెరవలి, మేజర్ న్యూస్ : కానూరు గ్రామపంచాయతీ నందు 75 వ రాజ్యాంగ ఆమోద దినోత్సవ కార్యక్రమం సర్పంచ్ బావన మధు పూర్ణ చందు అధ్యక్షతన జరిగినది. సర్పంచ్ మధు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగ రచన కమిటీ రెండు సంవత్సరముల 11 నెలల 18 రోజులు కష్టపడి రాజ్యాంగంలో వివిధ అంశాలు పొందుపరిచి 1949 సంవత్సరం నవంబర్ 26వ తేదీన పార్లమెంట్ నందు భారత రాజ్యాంగంలో ప్రవేశపెట్టారని మన రాజ్యాంగం మనకు సమానత్వం, స్వేచ్ఛ మరియు న్యాయాన్ని కల్పించే ఒక గొప్ప మార్గదర్శకం. ప్రతి పౌరుడికి హక్కులను రక్షించడంలో ఇది ముఖ్యపాత్ర పోషిస్తుంది. నవంబర్ 26వ తేదీ మంగళవారం మన రాజ్యాంగ నిర్మాతల సమర్పణను స్మరించుకుంటూ, మన దేశాభివృద్ధి కోసం బాధ్యతగానే ముందుకు సాగుదాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ టి రాంబాబు ఉప సర్పంచ్ అనపర్తి నరసింహారావు. బూరుగుపల్లి నారాయణరావు. గారపాటి సత్యనారాయణ. గ్రామస్తులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మల్లేశ్వరంలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం



పెరవలి, మేజర్ న్యూస్ : మల్లేశ్వరం గ్రామంలో నిడదవోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు ఆదేశాలతో నవంబర్ 26వ తేదీ మంగళవారం స్థానిక తెదేపా నాయకుల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా తెదేపా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవాలని తద్వారా తమ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ భరోసాగా ఉంటుందని ఈ సభ్యత్వం వందరూపాయలు రుసుం చెల్లించి సభ్యత్వం తీసుకోవడం వల్ల ప్రమాదవశాత్తు ఏమన్నా జరిగినా ఐదు లక్షల రూపాయలు ప్రమాద బీమా ఉంటుందని మరియు మట్టి ఖర్చుల కింద పదివేల రూపాయలు అదనంగా అందజేస్తారని బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ విద్యా వైద్య ఉపాధి వంటి సదుపాయాలు కల్పించి ఆ కుటుంబాన్ని ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు నియోజవర్గ ఐటీడీపీ అధ్యక్షులు అబ్బిశెట్టి సత్తిరాజు మాజీ ఎంపిటిసి సభ్యులు ఆకుల వెంకటేశ్వరరావు గ్రామ మాజీ ఉపసర్పంచ్ మేడిచర్ల భాస్కర్ సత్యనారాయణమూర్తి రాంబాబు సభ్యత్వ నమోదు ఆపరేటర్ సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణులు ఐక్యతతో ముందుకు సాగాలి

**– కార్తీక వన సమారాధనలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** నాయి బ్రాహ్మణులంతా ఐక్యతతో ముందుకు సాగాలని పిఠాపురం పట్టణ నాయి బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం సభ్యులు అన్నారు. మాదాపూర్ రోడ్ లో గల మామిడి తోటలో నాయి బ్రాహ్మణ కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సంఘ సభ్యులు మాట్లాడుతూ... నాయి బ్రాహ్మణులు అంతా కలిసి మండల స్థాయి నుండి నియోజకవర్గ, జిల్లా రాష్ట్ర స్థాయి వరకు సంఘాలను బలోపేతం చేసుకుని ఐక్యతతో పనిచేసి మన హక్కులను సాధించుకోవలసిన అవసరం ఉందన్నారు. మన సంఘాలు బలంగా పనిచేస్తేనే మన హక్కులను సాధించుకోగలమని తెలిపారు. సంఘ సీనియర్ సభ్యులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్తీక వన సమారాధన కార్యక్రమంలో... పిఠాపురం పట్టణ నాయి బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ప్రెసిడెంట్ అల్లూరి వెంకటపతి, జిల్లా జాయింట్ సెక్రెటరీ నల్లమిల్లి అర్పణ కుమార్, యూనియన్ సెక్రెటరీ నల్లమిల్లి పవన్ కుమార్, జాయింట్ సెక్రెటరీ దత్తు ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పార్టీలో కష్టపడ్డ వారికి గుర్తింపు దక్కడం అభినందనీయం

**– టీడీపీ రూరల్ కో కన్వీనర్ కటకంశెట్టి బాబీ**



**కాకినాడ రూరల్,మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తూ మూడు పార్టీల నాయకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత లభించడం హర్షించతగ్గ విషయమని కాకినాడ రూరల్ టిడిపి కో–కోఆర్డినేటర్ కటకం శెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం బాబీ ఆధ్వర్యంలో స్థానిక తిరుమల ఫంక్షన్ హాల్ నందు నామినేటెడ్ పదవులు కేటాయించిన శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్ గౌడ్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లబత్తులా అప్పారావు లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కటకం శెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) మాట్లాడుతూ టిడిపి పార్టీలో కష్టపడినవారికి తగిన ప్రతిఫలం లభిస్తుందని, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకులను నామినేటెడ్ పోస్టుల ద్వారా వారికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్రంలో మూడు పార్టీల కలయికతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక మూడు పార్టీల నాయకులను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నామినేటెడ్ పదవులు ప్రకటించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ మండలం అధ్యక్షుడు రాందేవు సీతయ్య దొర, కరప మండలం మాజీ ఎంపీపీ గుల్లపల్లి శ్రీనివాస్, కముజు నెహ్రూ, కాకర్లపల్లి చలపతి,ఏటుకూరి నాగమణి, కంచుమర్తి లావణ్య, లావరాజు, మార్కండేయులు, దొరబాబు, బిజెపి నాయకులు చత్రపతి శివాజీ, కృష్ణ, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పలువురికి జరిమాన, ఆరుగురికి జైలు

**కాకినాడ రూరల్, మేజర్‌న్యూస్ :** ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన పదిమందిపై కేసుల నమోదు చేశారు. మంగళవారము వీరందరినీ కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి జైలు శిక్ష, నలుగురికి పదివేల చొప్పున 40 వేల రూపాయలు కాకినాడ స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వాల్మీకి నరసింహ జరిమానా విధించారని ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని ఉద్దేశంతో పోలీసులు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారని తెలిపారు.